ప్రజాశక్తి
శుక్రవారం 14 జూన్ 2024
5
కర్నూలు





సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

వడ్లోని వంక కబ్జాపై విచారణ చేపట్టాలి

- అన్యాక్రాంతమైన స్థలాన్ని కాపాడాలి
- 17న మండల కార్యాలయం ముందు ఆందోళన : సిపిఎం మండల కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో వడ్లోని వంక భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడం వలన ఎలిమెంటరీ స్కూలు హాస్టల్ దళిత వాడలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, వెంటనే విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో సిపిఎం కల్లూరు మండలం కమిటీ సమావేశం ఎ.కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జి.రామకృష్ణ, మండల కార్యదర్శి కె. మధు మాట్లాడారు. కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో వడ్లోని వంక భూమిని ఆక్రమించడం వలన దళితవాడలో నీళ్లు ప్రవేశించి దుర్గంధమైన వాసన రకరకాలుగా దళితవాడ ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. అట్లాగే ప్రభుత్వ హాస్టల్‌లోనీరు ప్రవేశించి క్రిమి కీటకాలు ప్రవేశించి విద్యార్థులు భయ భ్రాంతులకు గురవుతున్న పరిస్థితి ఉందన్నారు. నీళ్లు రావడం వలన హై స్కూల్ ప్రహరీ గోడ కూడా కూలిపోయిందని తెలిపారు. కాబట్టి వెంటనే కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని నీళ్లు యధావిధిగా పోయేటట్లు చర్యలు చేపట్టాలని దీనిపై సంపూర్ణమైన విచారణ జరిపించేందుకు జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పందిపాడు శీను, పెద్దపాడు గోపి, ఉల్లందకొండ రామఆంజనేయులు, చెట్ల మల్లాపురం సోమేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. సోమవారం రోజు తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టాలని ఆందోళన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సంతృప్తి..!

- సిఎం ఐదు సంతకాలపై పలువురి అభిప్రాయం
- ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని డిమాండ్



తొలిసంతకం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రిగా గురువారం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. మెగా డిఎస్‌సి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ల పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైళ్లపై సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి చేసిన ఐదు సంతకాలపై పలువురు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే డిఎస్‌సి ద్వారా ఉద్యోగాల భర్తీపై మాత్రం కొంత అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయాలని యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు..

రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావాలి



ల్యాండ్ టైటిలింగ్ యాక్టులో అనే లొసుగులు ఉన్నాయి. భూమి విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. రైతులు దీనిపై తీవ్ర ఆందోళనలు ఉన్నాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా హైకోర్టులో మాత్రమే అప్పీలు చేసుకోవాలని తెలిపారు. దాంతోనే వ్యతిరేకతతో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు ఓటు వేశారు. రైతులకు ఉపయోగపడే మెరుగైన చట్టాన్ని తీసుకురావాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కుటుంబ పోషణకు ఉపయోగం



నేను గతంలో రూ.3వేల పింఛన్ తీసుకునే వాన్ని. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.4వేలు పింఛన్ ఇస్తున్నారనడం సంతోషదాయకం. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ పింఛన్ ఇవ్వడం మా కుటుంబ పోషణకు చాలా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

- ఆకుల గోరంట్ల, పెండేకల్ ఆర్ఎస్, తుగ్గలి మండలం.

అన్ని ఖాళీలనూ భర్తీ చేయాలి



డిఎస్‌సికి సంబంధించిన పోస్టులు రాష్ట్రంలో 39వేల ఖాళీలు ఉన్నాయి. కేంద్ర మంతి గతంలో ప్రకటించారు. డిఎస్‌సి కింద మొత్తం 39 వేల ఖాళీలనూ భర్తీ చేయాలి. టెట్ కం టిఆర్‌టి పెడతారా లేక టెట్ వేరుగా నిర్వహించి తరువాత డిఎస్‌సి నిర్వహిస్తారా అనేది స్పష్టత లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. పాఠశాలల రేషనలైజేషన్ కోసం తీసుకొచ్చిన జిఒ 117ను రద్దు చేయాలి. కానిస్టేబుల్ నియామకం నోటిఫికేషన్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. దాన్ని పరిష్కరించాలి. రాష్ట్రంలో అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న 2.36 లక్షల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఆ పోస్టులను భర్తీ చేసే వరకూ జులై నుంచే నిరుద్యోగ భృతి అమలు చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్లకు తగ్గించాలి.

- వై.నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

ఎంతగానో ఉపయోగపడుతుంది



వృద్ధాప్య పింఛన్ రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచడం ఆనందదాయకం. పిల్లలు చూసుకోకుండా ఉండే వృద్ధులకు రూ.4వేలు ఎంతగానో ఉపయోగపడుతుంది. పెంచిన పింఛన్ వృద్ధులకు చాలా ఆసరాగా ఉంటుంది. పింఛన్ పెంచుతూ సంతకం చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

- గద్వాల కౌలుట్లయ్య నాయుడు, పింఛన్‌దారుడు, గోనెగండ్ల.

కుటుంబానికి కొంత ఆసరా



పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడం చాలా సంతోషం. ఇప్పటి వరకూ రూ.3వేల పింఛన్ తీసుకునే వాన్ని. పెంచిన ఫించన్ వల్ల కుటుంబానికి కొంత ఆసరాగా ఉంటుంది. పింఛన్‌ను ఇబ్బంది లేకుండా అందించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పి.పెద్ద ఖాసిం సాబ్, దేవనకొండ.

అభివృద్ధి అంశాలపై పురోగతి సాధించండి

- నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో యాస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపికైన చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హోళగుంద బ్లాక్‌ల అభివృద్ధి అంశాల పై పురోగతి సాధించాలని నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యం జిల్లా కలెక్టర్‌కు సూచించారు. గురువారం ఢిల్లీ నుండి నిర్వహించిన నీతి ఆయోగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కలెక్టర్ ఛాంబర్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హోళగుంద బ్లాక్‌ల డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అభివృద్ధి అంశాలపై నీతి ఆయోగ్ సిఇఒకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. తదనంతరం చిప్పగిరి, మద్దికెర (ఈస్ట్), హోళగుంద బ్లాక్ డెవలప్‌మెంట్‌లకు సంబంధించిన అభివృద్ధి అంశాలపై నిర్దేశించిన లక్ష్యాలను సాచ్యురేషన్ మోడ్‌లో సాధించాలని నీతి అయోగ్ సిఇఒ కలెక్టర్‌కు సూచించారు. కలెక్టరేట్ ఎన్ఐసి నుండి వీడియో కాన్ఫరెన్స్ హాలులో పాల్గొన్న సిపిఒ హిమప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

పైరవీల 'షెల్యూట్'

- ప్రజా ప్రతినిధుల వద్ద క్యూ కడుతున్న పోలీసు అధికారులు
- బదిలీ కోసం ఫైళ్లు సిద్ధం చేస్తున్న పోలీసు శాఖ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడడంతో ఆయా శాఖల్లో పైరవీలకు తెరలేచింది. ఇదివరకు రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వం తనకు అనుకూలమైన అధికారులను తమ ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు స్థానభ్రంశాలు కల్పించిందనే ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో అదే తరహాలోనే ఈ ప్రభుత్వం కూడా ఆయా అధికారుల స్థానభ్రంశాలు నియామకాల కోసం దస్త్రాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసు శాఖకు సైతం అలాంటి సూచనలు మౌఖికంగా ప్రభుత్వం నుంచి ఉండడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే అందుకు సంబంధించిన దస్త్రాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన అధికారులను ఆయా స్థానాల్లో నుంచి తప్పించి తమకు అనుకూలమైన అధికారులను, ముఖ్యంగా టిడిపి హయాంలో పనిచేసిన అధికారులను తిరిగి నియమించుకుంటే కలిసి వచ్చే అవకాశం ఉందని అటు అధికారులు ఇటు టిడిపి నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు కొందరు అధికార పార్టీ నాయకులు ప్రజాప్రతినిధుల వద్దకు క్యూలు కడుతున్నారు. అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరిగి కాకా పట్టే పనిలో కొంతమంది ఉంటే మరి కొంతమంది పైరవీలతో తాము కోరుకున్న స్థానాల్లో పోస్టింగులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు సైతం తమకు అనుకూలమైన వారికి పోస్టింగులు కల్పించి గత ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసిన అధికారులకు ఉద్వాసన పలికేందుకు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరి కొద్ది రోజుల్లో పోలీసు అధికారుల స్థానభ్రంశాలు, పోస్టింగులు వ్యవహార ప్రక్రియ మరింత జోరందుకోనున్నదని ఆ శాఖలో చర్చ సాగుతోంది.

పాఠశాలకు తాళాలు

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని

- గార్లదిన్నె విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుని బయటకు పంపించి పాఠశాలకు తాళాలు వేశారు. ఈ సంఘటన ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని గార్లదిన్నె గ్రామ ఎంపిపి పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని, అక్కడ తాత్కాలికంగా పని చేస్తున్న ఉపాధ్యాయులు గురుస్వామిని పాఠశాల నుంచి బయటకు పంపించి విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా విద్యారుల్థ తల్లిదండ్రులు మాట్లాడారు. గతేడాది నుంచి ఎంపిపి పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక 90 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఉన్న రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతిపై అక్కడి నుంచి బదిలీ అయ్యారని చెప్పారు. అప్పటి నుంచి ఒక్క రెగ్యులర్ ఉపాధ్యాయుని కూడా నియమించలేదని తెలిపారు. ఒక తాత్కాలిక ఉపాధ్యాయుని నియమించారని చెప్పారు. 5వ తరగతి అయిపోయిన విద్యార్థులకు ముందు తరగతులకు వెళ్లడానికి టిసి కావాలని, ఆ టీసీపై రెగ్యులర్ ఉపాధ్యాయుని సంతకం ఉండాలని తెలిపారు. కానీ ఈ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేనందుకు సంతకాలు చేయడానికి టీచర్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గతంలో ఈ సమస్యపై గ్రామస్తులందరమూ కలిసి జిల్లా విద్యాధికారులకు, మండల విద్యాధికారులకు ఎన్నోసార్లు విన్నవించామని తెలిపారు. ఎన్నో నిరసనలు తెలిపినా స్పందించడం లేదని వాపోయారు. ఇకనైనా విద్యాధికారులు దీనిని దృష్టిలో ఉంచుకొని గార్లదిన్నె గ్రామం ఎంపిపి పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు సుధాకర్, దావీదు, రాజన్న, ప్రతాప్, దేవిపుత్ర, హుస్సేని, దినేష్ పాల్గొన్నారు.



పాఠశాలకు తాళాలు వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



కలెక్టర్, ఎస్‌పిని కలిసిన ఎంపి బస్తిపాటి నాగరాజు

అభివృద్ధి, సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎంపిగా గెలుపొందిన బస్తిపాటి నాగరాజు జిల్లా ఉన్నతాధికారులను గురువారం మర్యాద పూర్వకంగా కలిసారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను, ఎస్‌పి జి.కృష్ణకాంత్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పై వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయం తో జిల్లాను అభివృద్ధి పరుస్తామన్నారు. ఇక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తామన్నారు. కర్నూలు జిల్లాను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లి దశ దిశ మారుస్తామన్నారు.

టిజి.భరత్‌కు ప్రయివేట్ ఐటిఐ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



రాష్ట్ర మంత్రిగా టిజి. భరత్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు ఐటిఐ మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌విజి శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ దామోదర్ చౌదరి , ఇతర సభ్యులు అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందచేసారు. రాష్ట్రంలోని ప్రయివేటు ఐటిఐ మేనేజ్‌మెంట్లు పడుతున్న ఇబ్బందుల గురించి తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఇబ్బందులు తొలగేలా ప్రయత్నం చేస్తామన్నారు.

సింగిల్ విండో అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి-సి బెళగల్ : సి బెళగల్ సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్‌రెడ్డికి సిఇఒలు రవి కుమార్ రెడ్డి, ఖాజా , సిబ్బంది శేఖర్, శివ లు గురు వారం సన్మానం చేశారు. ఆయన 2013 నుండి ఇప్పటివరకు అధ్యక్షులుగా ఉన్నప్పటి నుండి రూ.3 కోట్లు లావాదేవిలను ఏకంగా రూ.50 కోట్ల వరకు తెచ్చారన్నారు. ఇందులో ఎల్టి, క్రాప్, ఆర్జెసి, ఆర్వైజే, పిఎల్, ఎస్‌ఏ, వంటివి కోటిన్నర రుణాలు అందుకున్నారన్నారు. 16 దుకాణ సముదాయాలలో నెలసరి ఆదాయం, సభ్యత్వం పొందిన వారు 1705, రుణాలు పొందిన వారు 2650, మొతంగా రైతులు 4355 ఉన్నారని తెలిపారు. ఆయన రాజీనామా జీర్ణించుకోలేమని పేర్కొన్నారు.



గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

హాస్టళ్లలో సీట్ల కొరత

పత్తికొండలో మరో బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి

సిబ్బంది కొరతను తీర్చాలి

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ నియోజకవర్గంలోని చదువుకోవడానికి హాస్టల్లో లేక విద్యార్థులు ఇక్కట్లు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గం పరిధిలో బిసిలు అధికంగా ఉన్నందున మరొక బిసి హాస్టల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పత్తికొండ నియోజకవర్గంలో 10 వసతి గృహాలు ఏర్పాటు చేసింది. బాలుర వసతి గృహాలు ఏడు, బాలికల వసతి గృహాలు మూడు ఉన్నాయి. పత్తికొండలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసిలను కలుపుకొని సాంఘిక సంక్షేమ సమీకృత హాస్టల్ ఒకటి ఏర్పాటు చేసి 400 సీట్లు కేటాయించారు. బాలుర వసతి గృహం,బాలికల వసతి గృహం విడిగా ఉన్నాయి. ఆస్పరి మండలంలోని బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం ఉన్నాయి. క్రిష్ణగిరి మండలం కంబలపాడులో బాలుర వసతిగహం, ఎరుకల చెరువు గ్రామంలో బాలుర వసతిగృహం ఉన్నాయి. దేవనకొండ మండలం తెర్నేకల్ లో బాలికల వసతిగృహం, తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండేకల్లు బాలుర వసతి గహం, జొన్నగిరిలో బాలుర వసతి గృహం ఉన్నాయి. ఒక హాస్టల్లో దాదాపు 100 సీట్లకు పరిమితం . ఎస్సీ 70, ఎస్‌సి క్రిస్టియన్స్ 12, ఎస్‌టి 05, బీసీ 09, ఇతరులకు 04 సీట్లు కేటాయించారు. పత్తికొండ నియోజకవర్గంలో బిసి సామాజిక తగతికి అధికంగా ఉన్న ప్రాంతం. పత్తికొండలో బిసి హాస్టళ్లు లేవు. పత్తికొండ ప్రాంత ప్రజలు నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతుంటారు. విద్యార్థులు చదువుకోవడానికి హాస్టళ్లలో సీట్లు రాక దూర ప్రాంతాలకు వెళ్లే స్థోమత లేక చదువు మధ్యలోనే మాన్పిస్తున్నారు. సెప్టెంబర్ నుండి ఈ ప్రాంతంలో వలస బాట పడతారు. సుదూర ప్రాంతాలకు బతకడానికి పిల్లాపాపలతో వెళుతుంటారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బిసి విద్యార్థులకు మరొక ప్రత్యేక హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అరకొర సౌకర్యాలు: హాస్టల్లో అరాకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగడానికి నీరు, పడుకోవడానికి మంచాలు లేవు.



ఈ హాస్టల్‌ను వేదిస్తున్న సిబ్బంది కొరత

వర్షాకాలంలో దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. హాస్టల్లో మరుగుదొడ్లు దౌర్భాగ్యంగా మారాయి.

సిబ్బంది కొరత: పత్తికొండలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను కలుపుకొని సాంఘిక సంక్షేమ సమీకృత హాస్టల్ ను ఏర్పాటు చేశారు. దాదాపు 400 సీట్లున్నాయి. వార్డెన్ ఒకరు, వంట మనిషి ఒకరు, వాచ్మెన్ ఒకరు , స్వీపర్ ఒకరు ఉన్నారు. 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 9 హాస్టల్ పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఒక్కసారి ఉన్నతాధికారి కారులు ఆలోచించాలి.

పాలకులు నిర్లక్ష్యాన్ని వీడాలి


ఎస్ఎఫ్ఐ నాయకుడు వినోద్



పత్తికొండలోని బాలుర, బాలికల వసతి గృహాలను అదనంగా ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. విద్యార్థుల పట్ల రాజకీయ నాయకులు ,అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వసతి గృహాలను ఏర్పాటు చేయాలి. ఉన్న హాస్టళ్లలో సిబ్బంది కొరతను తీర్చాలని, లేనిచో విద్యార్థి సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కేటగిరి ప్రకారం సీట్లు కేటాయింపు

సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కె. బాబు



ఎస్సీ ఎస్టీ, బిసి ఓసి కేటగిరీల ప్రకారం సీట్లు కేటాయిస్తాం. ఎస్సీ విద్యార్థులను పరిమితికి మించి చేర్పించుకుంటాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనిచేస్తాం.

16 వార్డులలో సమస్యలను పరిష్కరించాలి

పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్




గౌరుచరితకు కమిషనర్ స్వాగతం

పాణ్యం నియోజకవర్గం పరిధిలోనికి వచ్చే కల్లూరు మండల పరిధిలోని 16 వార్డుల్లో తాగు నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌ను కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత గురువారం కర్నూలు నగర పాలక సంస్థ కార్యలయానికి ఎమ్మెల్యేగా తొలిసారి వచ్చారు. కమిషనర్ ఎ.భార్గవ్ తేజ, అదనపు కమిషనర్ పివి.రామ లింగేశ్వర్ మునిసిపల్ సిబ్బంది, అధికారులతో కలిసి స్వాగతం పలికారు. ఎ.భార్గవ్ తేజ మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ క్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిధిలోనికి వచ్చే కల్లూరు మండల పరిధిలోని 16 వార్డుల్లో తాగు నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు.

కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహించి నందుకు కర్నూలు నగరపాలక సంస్థ సిబ్బంది కమిషనర్‌కు శాలువాకప్పి బోకే అందించి ఘనంగా సన్మానించారు. అందుకు స్పందిస్తూ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ తనకు అన్ని విధాల సహకరించిన సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



గిరినాథ్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డొన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

గిరినాథ్ కుటుంబానికి కోట్ల పరామర్శ

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో వైసిపి వర్గీయుల చేతిలో హత్యకు గురైన టిడిపి నాయకుడు గిరినాథ్ చౌదరి కుటుంబాన్ని గురువారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి గిరినాథ్ చౌదరి కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. ఆయనతోపాటు టిడిపి సీనియర్ నాయకులు బొమ్మన శివశంకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, లక్ష్మి రెడ్డి, ఎరుకల చెరువు శివన్న, సుధాకర్ గౌడ్, రామళ్లకోట ఆచారి, కలుగొట్ల రామకృష్ణ, బోగోలు అమర్నాథ్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్, అల్లుగుండు శివ, లక్ష్మీనాథ్, టిడిపి మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

జిజి హెచ్‌లో టిబి ముక్త్ భారత్ బృందం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో టిబి ముక్త్ భారత్ బృందం పర్యటించిందని ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సిబ్బందితో ఇన్‌పెక్షన్ నియంత్రణ పద్ధతులకు సంబంధించి అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎఎంసి, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ల్యాబ్, ఎఆర్ టి సెంటర్, టిబి సిడి విభాగాలలో టిబి ముక్త్ భారత్ బృందం పరిశీలించిందని తెలిపారు. టిబి ముక్త్ భారత్ బృందం పర్యటనలో భాగంగా బయో మెడికల్ వేస్టే మేనేజ్‌మెంట్ వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించిన అనంతరం వాటి ఉపయోగాల గురించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. బయో మెడికల్ వ్యర్థాలను ఎలాయూస్ చేయాలి. వాటికి సంబంధించిన ఏఏ వ్యర్థాలను ఏఏ రంగు డబ్బాలలో వేయాలి, వ్యర్థాలను నిర్దేశించిన రంగు డబ్బాలలో మాత్రమే వెయ్యాలనే దానిపై సెగ్రిగేషన్ ఎలా జరగుతుందని వివిధ విభాగాల సిబ్బంది అవగాహన కల్పించారు. టిబి ముక్త్ భారత్, కోఆర్డినేటర్ డాక్టర్ నీరద, ఆసుపత్రి ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, , అడ్మినిస్ట్రేటర్స్, డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్, సావిత్రిబాయి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



స్రిబ్బందికి అవగాహన కల్పిస్తున్న టిబిమ్కుక్త్ భారత్ బృందం



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

గత టిడిపి హయాంలో శంకుస్థాపన చేసిన నీటి ప్రాజెక్టులను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఆదోని సుందరయ్య భవన్‌లో సిపిఎం నాయకుల సమావేశం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు అప్పట్లో నీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారని తెలిపారు. వేదవతి, ఆర్‌డిఎస్, గుండ్రేవుల, హంద్రీనీవా వెడల్పు వంటి నీటి ప్రాజెక్టు పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందని, దీంతో ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. గత ప్రభుత్వ విధానాలు నచ్చకపోవడంతోనే జగన్‌ను గద్దె దింపారన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. బెంగళూరు, హైదరాబాద్‌కు మధ్యనున్న కర్నూలు ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాలన్నారు. ఓర్వకల్లు ప్రాంతాన్ని 'టూరిస్ట్ హబ్'గా మార్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న టిడిపి, జనసేనలు విభజన చట్టంలో పేర్కొన్న హామీలను రాబట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రధానమంత్రి మోడీ గ్రాఫ్ తగ్గిందన్నారు. మోడీ, అమిత్‌షాలు అనుచరుల ఆస్తులు పెంచే దిశగా షేర్లు కొనుగోలు చేసేలా కుట్రపన్నారని విమర్శించారు. ఎన్నికల్లో గెలవడం ఖాయమని, తమకు అనుకూలంగా ఉన్న మీడియాలో ఇంటర్వ్యూలు ఇచ్చి ప్రజలను నమ్మేలా మోడీ మోసం చేశారని మండిపడ్డారు. జూన్ 1న ఎగ్జిట్ పోల్ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించారని, వారి కుట్ర వల్ల సుమారు రూ.30 లక్షల కోట్ల ప్రజాధనం షేర్ మార్కెట్‌లో ఆవిరయిందని తెలిపారు. అయోధ్యలోనే ప్రజలు బిజెపిని ఆదరించలేదన్నారు. ఇండియా కూటమి బలపడిందని పేర్కొన్నారు. బిజెపికి కాలం చెల్లుతోందని, క్షేత్రస్థాయిలో సిపిఎంను బలోపేతం చేసి ప్రశ్నించే దిశగా నిర్మాణం చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆరునెలల వ్యవధి ఇస్తున్నామని, అప్పటికీ హామీల నెరవేర్చకపోతే ప్రజా ఉద్యమానికి దిగక తప్పదని హెచ్చరించారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శి లక్ష్మణ్, లింగన్న, పిఎస్.గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు, కృష్ణమూర్తి, వీరారెడ్డి, నాగరాజు, వీరేష్, ముక్కన్న, తిక్కప్ప, అయ్యప్ప పాల్గొన్నారు.

శ్రీమఠంలో పేజావర మఠం పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్ణాటక రాష్ట్రంలోని ఉడుపి అష్ట మఠాల్లో ఒకటైన పేజావర మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వప్రసన్న తీర్థులు గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయకులు బింధు మాధవాచార్, పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని, వాధీంద్ర తీర్థుల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రతిభా అవార్డు గ్రహీత, పండితకేసరి, మహామహోపాధ్యాయ శ్రీరాజా ఎస్.గిరియాచార్ ఆయనకు పూలమాల, శాలువా, పండ్లు సమర్పించారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న పేజావర మఠం పీఠాధిపతులు

తెరచుకున్న పాఠశాలలు...

- విద్యార్థి కిట్ల పంపిణీకి అధికారుల చర్యలు
- యూనిఫారం పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రెండు నెలల విరామం తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. గురువారం అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు తెరచుకున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడిబాట పట్టారు. వేసవి సెలవులతో మూగబోయిన పాఠశాలల్లో సందడి కనిపించింది. 2024-25 కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యాశాఖ అధికారులు విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానిస్తున్నారు.


కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఇఒ శ్రీనివాసులు

వేసవి సెలవులు ముగిసి గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన అన్నింటినీ అందజేసేందుకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే సగానికి పైగా పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరుకున్నాయి. యూనిఫారం మినహా మిగతా సామగ్రి కూడా నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంటోంది. వాటిని కూడా విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఆదోని ఎంఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం ఆయా పాఠశాలకు విద్యార్థుల కిట్లను పంపిణీ చేశారు.

ఆదోని నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక పాఠశాలల్లో 132 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 29 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జగనన్న విద్యా కానుక (జెవికె) పేరున పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, బ్యాగులు గత ఐదేళ్లలో పంపిణీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో విద్యా కానుక కిట్లకు బదులుగా 'స్టూడెంట్ కిట్'గా పేరు మార్చి స్కూల్ బ్యాగులపై గతంలో ఉండే జగన్మోహన్ రెడ్డి ఫొటో కూడా తీసివేశారు. ఈ కిట్లలో ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంచి పాఠశాలల వారీగా కేటాయించి పంపిణీ చేశారు.

అందని యూనిఫారం, బూట్లు, సాక్సులు, డిక్షనరీ

పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, వర్క్ బుక్‌లు, బెల్టు, స్కూలు బ్యాగు మాత్రమే విద్యార్థికిట్టుగా విద్యార్థులకు అందిస్తున్నారు. యూనిఫారం, బూట్లు, సాక్సులు, డిక్షనరీ అందలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో విద్యార్థి కిట్లు నూతన ఎమ్మెల్యేలతో పండగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. కిట్ల పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలకు ఆయా మండలాలకు ఎన్ని కిట్లు, విద్యార్థుల సంఖ్య వంటి వివరాలు విద్యా శాఖాధికారులు పంపించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

గందరగోళంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు

ప్రభుత్వం మారడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణ గందరగోళంగా మారింది. గత ఐదేళ్లుగా వైసిపి నాయకుల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ జరుగుతుండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీల బాధ్యతలను గ్రామాల్లో జనసేన, టిడిపి, బిజెపి మద్దతుదారులు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన వారితో మధ్యాహ్న భోజనం తయారు చేయించాలన్న సందిగ్ధంలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ప్రతి విద్యార్థికీ కిట్లు అందిస్తాం
- ఎంఇఒ శ్రీనివాసులు, ఆదోని



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ కిట్లు అందిస్తాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బెల్టులు అందించాం. విద్యార్థులకు వీటిని త్వరలో పంపిణీ చేస్తాం.


అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాధనం వృథా కారాదు

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప

ప్రజాశక్తి - కౌతాళం

పరిపాలనలో ప్రజాధనం వృథా కారాదని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, తెలుగు రైతు కార్యదర్శి వెంకటపతి రాజు తెలిపారు. గురువారం కౌతాళంలో నూతన పాఠ్యపుస్తకాలు, స్కూల్ కిట్స్‌ను ఎంఇఒ శోభారాణితో కలిసి పంపిణీ చేశారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో వారు మాట్లాడారు. పాలనలో ప్రజాధనం వృథా కాకుండా, పగలు, ప్రతీకారాలకు చోటు ఉండకూడదంటూ తెలిపారు. జగన్ ఫొటోలు ఉన్న నూతన పాఠ్యపుస్తకాలు, స్కూల్ కిట్స్‌ను అలాగే పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అన్ని పాఠశాలలకు సకాలంలో అందించి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యారంగంలో రాణించాలని కోరారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, సిద్ధు, మంజునాథ్, రాజబాబు, సోమశేఖర్, చంద్ర, సునీల్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- ప్రకృతి వ్యవసాయ అధికారి బుజ్జేశ్వరుడు

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయాన్ని సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయ అధికారి బుజ్జేశ్వరుడు తెలిపారు. గురువారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో బంజరు భూముల్లో పంటల సాగు గురించి ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. గ్రామంలో 25 రోజుల క్రితం వర్షం రాకముందు నవధాన్యాలు తీసుకుని పేల్లటైజేషన్ చేసి విత్తనాలు నాటారని తెలిపారు. వేసిన విత్తనాలు వర్షాలకు బాగా మొల్లకాలు వచ్చాయని చెప్పారు. ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేసుకోవడం వల్ల ఆరోగ్యం, ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతులకు తెలిపారు. బంజరు భూముల్లో కూడా పంట తీయవచ్చని చెప్పారు. మోడల్ మేకర్ రంగస్వామి, ఎల్ వన్ హుస్సేన్, ఎల్ టు జంగం వీరశేఖర్, ఐసిఆర్‌పిలు రాముడు, వీరాంజనేయులు, సత్య నారాయణ, సురేంద్ర, కె.రాజేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆలూరు

వెనుకబడిన ఆలూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఈసారైనా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా ఆలూరు ప్రాంత ప్రజలు తాగు, సాగు నీరు లేక వర్షంపై ఆధారపడుతూ ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి బతుకుతున్నారని తెలిపారు. మళ్లీ అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు, యువతకు ఉపాధి అవకాశం కల్పించాలంటే పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోన ప్రాజెక్టులను పూర్తి చేసి, విద్య, ఉపాధిపై దృష్టి సారించాలని కోరారు. సిపిఎం మండల నాయకులు కెపి.నారాయణస్వామి, షాకీర్, కృష్ణ, ఈరన్న, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ


తీవ్ర గాయాలైన సోమలింగమ్మ

ఆటో బోల్తా

- ఒకరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామ సమీపంలో గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో గొల్ల గుడ్డ లక్ష్మన్న (55) అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల మేరకు... పెద్దహోతూరు గ్రామం నుంచి (ఎపి 02 టిసి 4393 నెంబర్ గల) ఆటో పెద్దహోతూరు నుంచి ఆలూరుకు బయల్దేరింది. గ్రామ శివారులో అధిక వేగంతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో డ్రైవర్‌తో పాటు గొల్ల గుడ్డ లక్ష్మన్న, సోమ లింగమ్మ, గొల్ల సన్నీ, హనుమంతు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గొల్ల గుడ్డ లక్ష్మన్న (55) అక్కడికక్కడే మృతి చెందారు. వృద్ధురాలు సోమలింగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు గొల్ల గుడ్డ లక్ష్మన్నకు భార్య లక్ష్మితో పాటు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

పవన్‌ను కలిసిన మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అయినట్లు జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప గురువారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయం సాధించడంతో పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. త్వరలో నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు పవన్ కల్యాణ్ మల్లప్పకు తెలిపారు. తనకు కష్టకాలంలో తోడుగా నిలిచినందుకు మల్లప్పను పవన్ కల్యాణ్ అభినందించారు.


పవన్ కల్యాణ్‌తో ఉన్న మల్లప్ప


వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్

ఘనంగా పునీత ఆంథోని పండగ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పునీత ఆంథోని అనాథాశ్రమ పాఠశాలలో సుప్రసిద్ధ క్యాథలిక్ గురువు, కీర్తిశేషులు పునీత ఆంథోని పండగ వేడుకలను ఆశ్రమ డైరెక్టర్, కరస్పాండెంట్ ఫాదర్ రెవరెండ్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదోని డివిజన్ ప్రాంతంలోనే కాకుండా కర్ణాటక బళ్లారి, రామదుర్గం ప్రాంతాల నుంచి ఆంథోని భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ ఫాదర్ బాలరాజు, ప్రధానార్చకులుగా రెవరెండ్ ఫాదర్ ఆవుల జాన్ దేవదాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పునీత పాదువాపురి ఆంథోని అనేక అద్భుతాలు కలిగిన వ్యక్తిగా ప్రపంచవ్యాప్తంగా పేరు గంచారన్నారు. ఈ గురువు పేరుతోనే పునీత ఆంథోని వారు పాఠశాలగా నామకరణం చేశారన్నారు. హాజరైన వేలాది మంది భక్తులకు భోజన వసతులు కల్పించారు. కర్నూలు, నందికొట్కూరు విచారణకు చెందిన ఫాదర్ లోక దశ్, బాల ఏసు, గల్లెల విజయ్ కుమార్, రామదుర్గం విచారణకు చెందిన ఫాదర్ జోసఫ్ కుమార్‌తోపాటు 16 మంది గురువులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని స్టాక్ పాయింట్ నుంచి ఎంఇఒ-1 రామాంజనేయులు, ఎంఇఒ-2 నీలకంఠ ఆధ్వర్యంలో గురువారం పాఠ్యపుస్తకాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10,691 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న స్టూడెంట్ కిట్లు గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌కు ఇప్పటికే చేరుకున్నాయని తెలిపారు. కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, గోనెగండ్ల జడ్‌పి హైస్కూల్, హెచ్.కైరవాడి, పుట్టపాశం, కులుమాల, గంజిహళ్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే మిగిలిన గ్రామాల్లోని పాఠశాలలకు శుక్ర, శనివారాల్లో పంపిణీ పూర్తి చేస్తామన్నారు.


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పవన్‌కు డిప్యూటీ సిఎం రావడం సంతోషకరం

- జనసేన తాలూకా నాయకులు నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సిఎం రావడం చాలా ఆనందంగా ఉందని జనసేన తాలూకా సీనియర్ నాయకులు, వికలాంగుల సంక్షేమ సంఘాల జెఎసి జిల్లా అధ్యక్షులు బీసీ.నాగరాజు తెలిపారు. గురువారం నాగరజు ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా జనసైనికులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సోమన్న సర్కిల్ వద్ద పవన్ కల్యాణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం, బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. పవన్ కల్యాణ్ పిఠాపురంలో అత్యధిక మెజార్టీతో గెలవడం, డిప్యూటీ సిఎంగా ప్రమాణ స్వీకారం చేసినందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న బీసీ.నాగరాజు

కొన్ని సంవత్సరాలుగా తాము ఎదురుచూస్తున్న తమ కళ నెరవేరిందని చెప్పారు. ఇందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్‌డిఎ కూటమిలో బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక ఈ రాష్ట్రం సంక్షేమాభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కలుగొట్ల రాజు మాట్లాడారు. రాబోయే 2029లో తమ పవన్ కల్యాణ్ సిఎం అవుతారని తెలిపారు. జనసేన తాలూకా నాయకులు పుల్లన్న, గుడికల్ రామకృష్ణ, ఇందిర నగర్ ప్రసాద్, కృష్ణ, రాజశేఖర్ గౌడ్, కొండయ్య, కుల్లూరు వెంకటేశ్వర్లు, ఈశ్వర్, భరత్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న నాయకులు

శ్రీఅమ్మవారి సన్నిధిలో మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో వెలసిన శ్రీఅమ్మ వారిని టిడిపి ఇన్‌ఛార్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. నాయకులు గోపాల్ రెడ్డి, బుద్ధారెడ్డి, సత్తిరెడ్డి, వీరేష్, వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లికార్జున స్వామి, గోపాల్, శేషన్న పాల్గొన్నారు.

అక్రమ డొనేషన్లపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌ఎవిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

అక్రమ డొనేషన్లు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎవిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడారు. జిఒ 1ను ఉల్లంఘించి పాఠశాలల్లోనే బుక్స్, బ్యాగ్స్, షూస్ అమ్ముతూ పాఠశాలలను వ్యాపార కేంద్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించి కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు రవీంద్ర, సోమనాథ, వీరేష్ పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయులును సన్మానిస్తున్న ఆర్‌డిటి సిబ్బంది

ఆర్‌డిటి చదువుల పండగ

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఆర్‌డిటి ఆధ్వర్యంలో గురువారం చదువుల పండగ నిర్వహించారు. ఎంపిపి మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాణిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నాగరాణి మాట్లాడారు. ఆర్‌డిటి వారు ఎందరో పేదల జీవితాల్లో వెలుగును నింపుతున్నారని తెలిపారు. చదవడానికి ఆర్థిక సోమత లేని కుటుంబాలను గుర్తించి ఆర్‌డిటి వారు పిల్లలను చదివిస్తున్నారని చెప్పారు. చదువుకునే పిల్లలకు బుక్స్, బట్టలు ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. ఆర్‌డిటి టీంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆదోనిలోని టిడిపి నాయకులు కలిశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా అమరావతిలో మంత్రులు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, కురువ సబితమ్మతోపాటు కర్నూలు ఎంపీ నాగరాజును గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేసినట్లు ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ దేవేంద్రప్ప తెలిపారు. టిడిపి నాయకులు వడ్డెమాన్ గోపాల్, నాగరాజు, గర్జప్ప, బీరప్ప, రాజు పాల్గొన్నారు.


ఎంపీ నాగరాజును అభినందిస్తున్న నాయకులు

దళారులను నమ్మి మోసపోకండి

- అధికారులను సంప్రదించండి - తహశీల్దార్ ప్రసాద్ రాజు

ప్రజాశక్తి - హోళగుంద


మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్‌రాజు

మండల ప్రజలు, రైతులు పనుల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా తహశీల్దార్ కార్యాలయంలో తమను సంప్రదించి అవసరమైన పనులు చేసుకోవాలని తహశీల్దార్ ఎఎన్.ప్రసాద్ రాజు సూచించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. దళారులను సంప్రదించడం వల్ల, అధికారుల పేరు చెప్పి రూ.వేలకు వేలు దోచుకుంటున్నట్లు తెలిసిందని తెలిపారు. దళారుల దగ్గరికి వెళ్లి పనులు చేసుకోవడం వల్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. కొంతమంది దళారులు అర్హత లేని పనులను చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇలాంటి పనులు చేయబోమని తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఈ-పాస్ పుస్తకం, వన్ బి, అడంగల్ నమోదు, పొజిషన్ సర్టిఫికెట్ల కోసం అర్హత ఉంటే విఆర్ఒ, రెవెన్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహశీల్దార్ నివేదికల ఆధారంగా పనులు వెంటనే కచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. గత రెండు నెలలు సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఉన్నందున అందుబాటులో ఉండలేదని తెలిపారు. ప్రస్తుతం పని వేళల్లో కచ్చితంగా కార్యాలయంలో అందుబాటులో ఉంటామన్నారు. తాము ప్రజలకు సేవ చేసేందుకే ఉన్నామని, ప్రభుత్వం తమకు జీతాలు చెల్లిస్తుందని తెలిపారు. చాలాకాలంగా రైతుల మధ్య హద్దులు, భూ సమస్యలుంటే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు త్వరలో ప్రతి శనివారం రెవెన్యూ కోర్ట్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ దినోజు కుమార్, విఆర్ఒలు పాల్గొన్నారు.

పవన్ గెలుపుతో జనసైనికుల సంబరాలు

ప్రజాశక్తి - ఆస్పరి

పిఠాపురం ఎమ్మెల్యేగా జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ గెలుపొందడంతో మండలంలో జనసేన ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. గురువారం మండలంలోని రామతీర్థం కొండలలో వెలిసిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అరవింద్, హేమంత్, సోమశేఖర్, శ్రీను మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి గెలుపుతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనతో ప్రజలు విసిగి పోయారని, మార్పు కోసం ఎన్‌డిఎ కూటమికి పట్టం కట్టారని తెలిపారు. టిడిపి నాయకులు సతీష్, జన సైనికులు మహేంద్ర, మనోజ్, వీరేష్, శివ, విశ్వనాథ్, విష్ణు, చంద్ర, షబ్బీర్, మహేష్, మహదేవ్, నాగార్జున, వినోద్, కార్తీక్, దస్తగిరి, సాయి, తిక్కయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన నాయకులు